క్లుప్తంగా

కాసిపేటకు చేరిన 'ప్రజాపోరుయాత్ర'



బుగ్గగూడలో నృత్యం చేస్తున్న కళాకారులు

కాసిపేట: ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని, సామాన్యులను, కార్మికవర్గాన్ని అణిచి వేసే కుట్రలో ముందుకు సాగుతున్నాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ విమర్శించారు. సీపీఐ ప్రజాపోరు యాత్ర 15వ రోజు మంగళవారం కాసిపేట మండలానికి చేరుకోగా జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోమటిచేనులో యాత్ర దళసభ్యులకు పూలమాలలు వేసి ప్రారంభించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సీపీఐ ప్రజాపోరు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దాగం మల్లేష్, జిల్లా సమితి సభ్యులు బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు బాపు, గట్టయ్య, సత్యం, పోశం, రాయలింగు తదితరులున్నారు.

కిడ్నీ జబ్బులపై అవగాహన

శ్రీరాంపూర్: సింగరేణి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్కే 7గనిపై కిడ్నీ జబ్బులు, వడదెబ్బలపై ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి అవగాహన కల్పించారు. కిడ్నీలు కాపాడుకోవడానికి ఎక్కువగా నీరు, పండ్ల రసాలు తాగాలన్నారు. రక్తపోటు, మధుమేహం ఉన్న వారు తరచూ కిడ్నీ పరీక్షలు చేసుకోవాలన్నారు. ధూమపానం, మద్యం సేవించరాదన్నారు. అధిక వేపుళ్ల వంటలు, ఎక్కువగా మాంసాహారం తీసుకోరాదన్నారు. కార్యక్రమంలో గని ఇన్‌చార్జి మేనేజర్ రవిశంకర్, అండర్ మేనేజర్లు రవీందర్, వెంకట్‌రామ్, రవితేజ, వెంటిలేషన్ అధికారి జగదీశ్వర్‌రావు, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ మెండె వెంకటీ, నాయకులు అశోక్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: మందమర్రి ఏరియాలోని రామకృష్ణపూర్, సోమగూడెం, బెల్లంపల్లి, మందమర్రిలో జరుగు సమ్మర్ కోచింగ్ క్యాంపునకు అర్హత కలిగిన పీఈటీలు ఈ నెల 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు పర్సనల్ డిపార్టుమెంట్‌లో అందించాలని వివరాలకు 9908555089 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

మాజీ ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్సీ

తాండూర్: స్థానిక మండల ప్రజాపరిషత్ మాజీ అధ్యక్షురాలు, ప్రస్తుత ఎంపీటీసీ మాసాడి శ్రీదేవిని మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పరామర్శించారు. శ్రీదేవి కొద్ది రోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ, ఆమె ఇంటికి వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట ఏఎంసీ డైరెక్టర్ దెబ్బెటి రమేష్, మున్నూరు కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మురుకూరి చంద్రయ్య, తాండూర్ బీసీసెల్ అధ్యక్షుడు మాసాడి నారాయణ, మాసాడి సత్తయ్య, లక్ష్మీనారాయణ ఉన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

కాసిపేట: ముత్యంపల్లి, కాసిపేట గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ముత్యంపల్లి సర్పంచ్ బాదు, ఉపసర్పంచ్ తిరుపతి ఆధ్వర్యంలో యువకులు గని మేనేజర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మూడు రోజులుగా నీరు సరఫరా కావడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్ ఆఫ్ మైన్స్ ఏజెంట్ రాజేందర్ రెండురోజుల్లో సమస్య పరిష్కరించనున్నట్లు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పంట నష్టపరిహారం చెల్లించాలని వినతి



మంచిర్యాలఅగ్రికల్చర్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు అందించాలని మంగళవారం బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ.. అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయిందని, ఈదురు గాలులకు నేలకొరిగి నష్టపోయిన పంటలకు, సాగు నీరందకా, ఎండిన యాసంగి పంటలకు రూ.25వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపతి రాజన్న, బోలిశెట్టి తిరుపతి, కిషన్, హరికృష్ణ, రాకేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు, వారి పిల్లలను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో సింగరేణి సంస్థ కోల్‌బెల్ట్ వ్యాప్తంగా స్టేడియాలు, ఉన్నతమైన మైదానాలు ఏర్పాటు చేసింది. ఆ మహత్తర ఆశయ సాధన దిశగా సాగాల్సిన స్టేడియాలు ఆచరణ విషయానికి వచ్చేసరికి నిర్వీర్యం అవుతున్నాయి. ఇందుకు రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియమే నిలువెత్తు నిదర్శనం. కనీసం పేద క్రీడాకారులకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తారనుకుంటే నాలుగేళ్లుగా వాటిపైనా సింగరేణి యాజమాన్యం చిన్నచూపే చూపిస్తోంది.



వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు(ఫైల్)

వేసవి శిక్షణ లేనట్లేనా?

- రామకృష్ణాపూర్ స్టేడియంపై సింగరేణి అధికారుల నిర్లక్ష్యం
- నాలుగేళ్లుగా ఇదే తంతు
- ఈ ఏడాదైనా అడుగులుపడేనా?

రామకృష్ణాపూర్(చెన్నూర్): మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో 2019 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం లేదు. నాలుగేళ్లుగా ఇదే దయనీయ పరిస్థితి. కోవిడ్ వైరస్ సాకుతో శిక్షణ శిబిరాలకు ఎగనామం పెట్టారు. అప్పటి నుంచి వీటి నిర్వహణ గగనకుసుమంగానే మారింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో చిన్నారులంతా ఆడుకునేందుకు స్టేడియానికి విచ్చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ఆయా క్రీడల్లో ప్రతిభ ఉన్న వారిని గుర్తించి శిక్షణ ఇస్తే ఎందరో ఔత్సాహిక క్రీడాకారులకు ఉపయోగపడుతుందని సీనియర్ క్రీడాకారుల అభిప్రాయం. కాగా ఎంతోమంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను అందించిన ఈ స్టేడియాన్ని నామరూపాల్లేకుండా చేయాలనేదే సంస్థ ఉద్దేశంగా కనిపిస్తోందని, కావాలనే సింగరేణి ఉన్నతాధికారులు ఠాగూర్‌స్టేడియం విషయంలో నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారనే విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

స్టేడియం అభివృద్ధికి రూ.60 లక్షలు

పట్టణంలోని ఠాగూర్ స్టేడియం అభివృద్ధికి సింగరేణి సంస్థ రూ.60 లక్షలు వెచ్చించింది. ఇందులో వాకింగ్ ట్రాక్ కోసం రూ.10 లక్షలు, క్రికెట్ పిచ్ కోసం రూ.50 లక్షలు ఖర్చు చేశారు. అంటే సింగరేణి యాజమాన్యం దాదాపు అర కోటికి పైగా నిధులు వ్యయం చేసింది. అలాంటి సంస్థ నేడు వేసవి శిక్షణా శిబిరాల నిర్వహణకు ఎందుకు వెనుకంజ వేస్తుందో అంతుపట్టడం లేదని కార్మికులు వాపోతున్నారు. సీఎస్ఆర్ పేరిట సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్న యాజమాన్యం శిక్షణ శిబిరాల నిర్వహణ పట్ల ఎందుకు మిన్నకుంటోందో తెలియడం లేదని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.



శిబిరంలో విద్యార్థులకు శిక్షణనిస్తున్న కోచ్(ఫైల్)

జాతీయ స్థాయిలో గుర్తింపు

రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఎంతోమంది క్రీడాకారులు ఆయా స్థాయిలో ఎదిగిన వారున్నారు. క్రీడల్లో రాణించి చాలామంది ఉన్నతమైన ఉద్యోగాలు సాధించారు. ఇలాంటి స్టేడియాన్ని ఏరియా ఎత్తివేశామనే సాకుతో పట్టింపు లేకుండానే చేస్తున్నారని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిక్రియేషన్ క్లబ్‌లు, స్విమ్మింగ్‌పూల్స్‌కు ఇస్తున్న ప్రాధాన్యత స్టేడియాలకు ఇవ్వడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి రామకృష్ణాపూర్‌లో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ కోసం తగు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

మున్సిపల్ సిబ్బందికి మెమోలు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న వివిధ విభాగాలకు చెందిన కొంతమంది కాంట్రాక్టు సిబ్బందికి మెమోలు జారీ అయ్యాయి. మేడే రోజు విధులకు గైర్హాజరు కావడంతో సంజాయిషీ ఇవ్వాలని ఆరుగురు సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మెమోలు జారీ చేశారు. ముందస్తు సమాచారం ఇచ్చిన సిబ్బంది విధులకు హాజరు కాలేకపోయారని, అదేరోజు జిల్లా అదనపు కలెక్టర్‌తో రివ్యూ సమావేశం ఉన్నా కూడా పాల్గొనలేదని, ఇందుకు సమాధానం చెప్పాలని కమిషనర్ సంజాయిషీ నోటీసును అందజేశారు. మేడే పర్వం దినం రోజున కూడా విధులకు హాజరుకాక పోవడాన్ని తప్పు పట్టడం సరికాదని సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ విషయమై కమిషనర్ సమ్మయ్యను వివరణ కోరగా పారిశుధ్య కార్మికులకు తప్పా, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది విధులకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దని ఉద్దేశ్యంతో సంజాయిషీ మెమోను జారీ చేశామని తెలిపారు. ఇందుకు సిబ్బంది సైతం సమాధానం ఇచ్చారని ఎలాంటి వివాదంలేదని పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మంచిర్యాలటౌన్: మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల వేతనాన్ని రూ.1,000 పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినందుకు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి మంగళవారం జిల్లా కేంద్రంలో పారిశుధ్య కార్మికులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, ఆశన్న, నవీన్, సత్తయ్య, నర్సింగ్‌కుమార్, సోహైల్ ఖాన్, సుధాకర్, సుమన్, రత్నం, కోకిల శ్రీను, సదానందం, దుర్గమ్మ, తిరుమల, రాజేశ్వరి, నగేశ్, రాయలింగు పాల్గొన్నారు.

సీవోఈ సెట్ ఫలితాల్లో బెల్లంపల్లి విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యార్థులు సెంటర్ ఆఫ్ఎక్సలెనీస్(సీవోఈ) ఫలితాల్లో సత్తా చాటారు. సోమవారం రాత్రి రెండో విడత సీవోఈ సెట్ -2023 ఫలితాలను వెల్లడించారు. ఈసారి బాలుర గురుకుల విద్యాలయం నుంచి 16 మంది సీటు సాధించినట్లు గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ సైదులు తెలిపారు. తొలి విడతలో 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి సీవోఈల్లో సీట్లు సాధించి రికార్డు సృష్టించగా, రెండో దఫా ఫలితాల్లోనూ మెరుగ్గా రాణించి ప్రతిభను చాటుకున్నారు. బాలుర గురుకుల విద్యాలయం నుంచి పదో తరగతి పూర్తి చేసుకున్న 71 మంది విద్యార్థులు సీఓఈ సెట్ పరీక్షరాయగా వీరిలో 28 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. గురుకుల విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రమోద్ కుమార్, శ్రీనివాస్, మల్లేశ్, రాజశేఖర్, రాజేశం, సమందర్, తేజస్వీ తదితరులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

రెండో విడతలో సీట్లు సాధించింది వీరే..

రెండో విడత సీవోఈ ఫలితాల్లో వేల్పుల రఘువరన్, దుగుట రాజేందర్, తలారి రాజు, రత్నం అంజి, పెరుగు విష్ణువర్ధన్, నీలాల అభిరాం, బీరెల్లి అంజిబాబు, దుర్గం సంజయ్‌కుమార్, గోమాస యశ్వంత్, గోమాస నిఖిల్, గోమాస వీర్, దుర్గం సాయికృష్ణ, దుర్గం సూర్యకాంత్, బొల్లం ప్రజ్యోత్‌కుమార్, కుమ్మరి సుహాస్‌ప్రతీక్, సుందిళ్ల ఆదర్ష్.

మొలకెత్తుతున్న ధాన్యం



ధాన్యం చూపిస్తున్న మల్లవ్వ, పెద్దంపేట, హాజీపూర్

మంచిర్యాల అగ్రికల్చర్: జిల్లాలో మూడు రోజులు కురిసిన అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. ధాన్యం కేంద్రాలకు తెచ్చిన పక్షం రోజులవుతున్నా కొనుగోళ్లు పుంజుకోలేదు. దీంతో అకాల వర్షాలకు తేమశాతం పెరుగుతోంది. తడిసిన ధాన్యం మొకలెత్తుతోంది. మరోవైపు కోతలు ఊపందుకోవడంతో తూకం లేక, లారీలు రాక, మిల్లులకు ట్యాగింగ్ లేక కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయి. రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. హాజీపూర్ మండలం టీకానపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంగళవారం పర్యటించి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యం వివరాలను ట్యాబ్‌లో విధిగా నమోదు చేయాలని చెప్పారు. ట్యాగింగ్ చేసిన మిల్లులకు ధాన్యం తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, తహసీల్దార్ రాజలింగు, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి మార్గం రజిత, రైతులు ఉన్నారు.



టీకానపల్లిలో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని కలెక్టర్‌కు చూపుతున్న తహసీల్దార్ రాజలింగు

పట్టాలిచ్చిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలి

- ఎమ్మెల్యే దివాకర్‌రావు
- శ్రీరాంపూర్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్: ఎన్నో ఏళ్ల నుంచి సింగరేణి స్థలాల్లో ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్న వారికి నేడు పట్టాలిచ్చిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా ఉండి మరోసారి గెలిపించాలని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. నస్పూర్ మున్సిపల్ పరిధిలోని అరుణక్కనగర్, జాన్సీనగర్, కటిక దుకాణాల ఏరియాలో సుమారు 520మందికి ఎమ్మెల్యే ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ టీ.రమేశ్, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకర్లు ప్రారంభం

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో వేసవి దృష్ట్యా తాగునీటి వాటర్ ట్యాంకర్లను మంగళవారం ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంచిర్యాల మున్సిపాలిటీలో 9వాటర్ ట్యాంకర్ల ద్వారా ప్రతిరోజు తాగునీటిని అందిస్తున్నామని, మరో 4ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని, వేసవిలో ఇబ్బంది లేకుండా తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఎమ్మెల్యే దివాకర్‌రావు పర్యటించారు. 25వ వార్డులో కంటి వెలుగు ప్రారంభించారు. 18, 21వ వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం సీసీసీ కార్నర్ వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి సరఫరా ట్యాంకర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



భీమిని/కాసిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): తమను రెగ్యూలర్ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక దీక్ష మంగళవారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా జేపీఎస్, ఓపీఎస్‌లు అంబేద్కర్ విగ్రహం చుట్టూ మానవహారంగా ఏర్పడి, దాదాపు అరగంటకుపైగా నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. సమ్మెకు పలువురు ప్రజాప్రతినిధులు, కుల, ప్రజాసంఘాలు మద్దతుగా నిలిచాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, ఆ పార్టీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. భీమినిలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలంటూ ఏఎంసీ చైర్మన్, ఎంపీపీ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కాసిపేటలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు, పెద్దనపల్లి సర్పంచ్ వేముల కృష్ణ సందర్శించి మద్దతు ప్రకటించారు.

పల్లెల అభివృద్ధికి కృషి చేయాలి

భీమిని: ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని ట్రెయినీ కలెక్టర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గౌతమి అన్నారు. భీమిని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. చిన్నతిమ్మాపూర్‌లో నీటి సమస్య, విద్యుత్ సమస్య పరిష్కరించాలని, పెద్ద తిమ్మాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం, రెండు సంవత్సరాలుగా స్కూల్ మూతపడి ఉందని ఈ పాఠశాలను రీ ఓపెనింగ్ చేయాలని సర్పంచ్ ఇందూరి భూమన్న విద్యాశాఖ అధికారికి సూచించారు. గ్రామపంచాయతీల్లో సేకరించిన చెత్తతో డంపింగ్ యార్డుల్లో వర్మీ కంపోస్టు తయారు చేసి విక్రయించేలా చూడాలని ట్రెయినీ కలెక్టర్ ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయానికి ఫర్నీచర్ రిపేర్ కోసం తీర్మానం చేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు మెడికల్ కిట్‌లను ట్రెయినీ కలెక్టర్ అందజేశారు. బిట్టూర్‌పల్లి, రాంపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ, వైస్ ఎంపీపీ మధు, ఎంపీటీసీలు మమత, సంతోష్, తహశీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీఓ సబ్దర్‌ఆలీ, ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాదేవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కిట్‌లు అందజేస్తున్న ట్రెయినీ కలెక్టర్ గౌతమి

నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలి

జైపూర్: గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్లు, డ్రెయినేజీలు ఎప్పటికప్పుడూ శుభ్రం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని రామారావుపేట గ్రామ పంచాయతీని మంగళవారం మొబైల్ తనిఖీల్లో భాగంగా స్థానిక అధికారులతో కలిసి సందర్శించారు. నర్సరీని సందర్శించి మొక్కలకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నీటిని అందించాలని, కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలని పంచాయతీ, ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. సెగ్రిగేషన్ షెడ్డులో కంపోస్ట్ పిట్‌లో కంపోస్ట్ ఎరువు తయారీ విధానం పరిశీలించి, తయారు చేసిన కంపోస్ట్ ఎరువును నర్సరీ, పల్లెప్రకృతి వనంలోని మొక్కలకు వినియోగించాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. తొలిసారి గ్రామపంచాయతీ గ్రామానికి వచ్చిన డీపీవో వెంకటేశ్వర్‌రావును స్థానిక సర్పంచ్ నామాల సత్యవతి, ఉపసర్పంచ్ తంగళ్లపల్లి వెంకటేశ్, వార్డు సభ్యులు శాలువాతో సన్మానించారు. ఆయనతో ఎంపీవో అనిల్‌కుమార్, పంచాయతీకార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు ఉన్నారు.



కంపోస్ట్ షెడ్డు పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

కోవిడ్ వ్యాక్సిన్ వేసుకోవాలి

మంచిర్యాలటౌన్: కోవిడ్ వ్యాక్సిన్ ప్రికాషనరీ డోస్‌ను జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేస్తున్నారని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వ్యాక్సిన్ వేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు సన్మానం

శ్రీరాంపూర్: మేడే సందర్భంగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డు అందుకున్న టీబీజీకేఎస్ నేతలను మంగళవారం ఏరియా కంపెనీ అధికారులు సన్మానించారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వాలని వినతి

చెన్నూర్: పేదలకు ఇంటి స్థలాలివ్వాలని, పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సభ్యుడు ఆశయ్య ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

గ్రామపంచాయతీగా చేయాలని వినతి

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి, ఊరు రామృష్ణాపూర్, నార్లపూర్‌లను మందమర్రి గ్రామ పంచాయితీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మందమర్రి గ్రామ పంచాయతీ సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు.

చెన్నూర్‌లో ప్రత్యేక పారిశుధ్య పనులు

చెన్నూర్: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని చెన్నూర్ మున్సిపాలిటీలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టగా కౌన్సిలర్ పోగుల సతీష్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్ పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీలో చేరిక

జన్నారం: మండల కేంద్రంలో వడ్డెర సంఘ నాయకులు మంగళవారం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మాజీ ఎమ్మెల్యే చుంచులక్ష్మయ్య వర్ధంతి

పాతమంచిర్యాల: మాజీ ఎమ్మెల్యే చుంచు లక్ష్మయ్య 15వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో తెలంగాణ బీసీ జాగృతి నాయకులు ఘనంగా నిర్వహించారు. చుంచు లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్, చుంచులక్ష్మయ్య కుటుంబసభ్యులు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'రైతులు నష్టపోకుండా చర్యలు'

బెల్లంపల్లిరూరల్: అకాల వర్షంతో వరిసాగు చేసిన రైతులు నష్టపోకుండా చర్యలు చేపడుతామని బెల్లంపల్లి ఏడీఏ సురేఖ అన్నారు. బెల్లంపల్లి మండలం, పెర్కపల్లి, బట్వాన్‌పల్లి, ఆకెనపల్లి, గురిజాల గ్రామాల్లో మంగళవారం నష్టపోయిన వరిపంట క్షేత్రాలను ఆమె పరిశీలించారు.

కాసిపేట: మండలంలో వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం మండల వ్యవసాయాధికారిణి వందన పరిశీలించారు. నష్టం జరిగిన వివరాలు, విస్తీర్ణం ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాన్ని మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు సరోత్తంరెడ్డి, జెడ్పీటీసీ తిరుమల ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రాజ్‌కుమార్‌నాయక్, సర్పంచ్ రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

పాతమంచిర్యాల: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న కూడళ్లలో ఐల్యాండ్‌లలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీలో మంగళవారం ఎంపీడీఓ లక్ష్మయ్య, సర్పంచ్ గాలి మధు ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రజలకు ద్రవ వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ పద్ధతులు, ట్విన్‌పిట్‌ల గురించి అవగాహన కల్పించారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

దండెపల్లి: మండలంలోని రెబ్బెనపల్లిలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఎల్లమ్మ పట్నాలు నిర్వహించారు. గౌడ కులస్తులు ఎల్లమ్మకు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అనంతరం పట్నాలు వేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బోనాల జాతరకు హాజరయ్యారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు పాల్గొన్నారు.



పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పాతమంచిర్యాల: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, పరిహారం చెల్లించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో మంగళవారం మాట్లాడారు. సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు కల్లాల్లోనే నిరీక్షించాల్సి వస్తోందన్నారు. అకాల వర్షాలు, వరదల వలన నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బ్రహ్మానందం, జిల్లా సహాయ కార్యదర్శి తోకల తిరుపతి, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, నాయకులు చాంద్‌పాషా, అరుణ, మల్లన్న, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.